# చిత్తశుద్ధి నిమిత్తమే కర్మాచరణ!

**లోకమందు పెక్కు భీకర కృత్యముల్**
**జరుగు కారణంబు అరయవలయు**
**స్వార్థరహిత సేవ సన్నగిల్లుటచేత**
**అర్థరహిత వాంఛ లధికమయ్యె**

**దివ్యాత్మ స్వరూపులారా!**

మానవుని ఉత్తేజపరచునది, ఉన్నతస్థాయికి గొనిపోవునది, నిష్కామ సేవయే! మానవుని మనో, బుద్ధులకు కావలసినంత శక్తిసామర్థ్యములనందించి, మానవత్వమును మేల్కొల్పునది నిష్కామ కర్మయే! అభ్యుదయమునకు కేవలము కర్మశీలత మాత్రమే చాలదు. ప్రేమ, దయ, నీతి, నిజాయితి, సానుభూతి, క్షమలు అత్యవసరమైనట్టివి. ఇట్టి ఉత్తమ గుణములు లేక మానవుడు నిష్కామ కర్మ ఆచరించుటకు సాధ్యము కాదు. మానవుడు నిత్యము అనుభవించే సుఖ దుఃఖములు, రాగ ద్వేషములు, విషయ వాసనలకు మనోవికారములే మూలకారణము. 'ఇది నాది, అది నీది' అనే ద్వైతభావమే యీ వికారములకు మూలకారణము. 'లోకము ఏమైనా అయిపోనీ, నేను మాత్రము క్షేమముగా వుండాలనే' స్వార్థభావమే ఈ ద్వైతమునకు మూలకారణము. దేహమే నేననియు నా కుటుంబము, నా సంపద, నా యొక్క స్థితియే నాకు ప్రధానమనియు భావించే జీవితము కేవలము ఒక స్వార్థపరమైన జీవితము. అట్టి మానవునకు 'సత్యమే అసత్యము, అసత్యమే సత్యము'గా పరిణమిస్తూ వుంటుండాది.

**సేవ చేయని జీవితము అంధకార బంధురమైనదే!**

అట్టి మానవుని హృదయమందున్న మాలిన్యమును దూరము చేయవలెనన్న సేవయే ప్రధానమైన మార్గము. నిష్కామ సేవ నిమిత్తమై ఏర్పడినదే మానవజన్మముగాని, స్వార్థమునకు కాదనే సత్యాన్ని గుర్తించటము అత్యవసరము. ఈ సేవలు కేవలము పేరు, ప్రతిష్ఠలకోసము

sri sathyasai vachanamrutam

చేయరాదు. ప్రపంచములో తన యొక్క పలుకుబడిని, అధికారమును ప్రకటితముగావించే నిమిత్తము సేవలు చేయరాదు. లోకసేవలద్వారా తనయొక్క స్వార్థమును, స్వప్రయోజనమును నెరవేర్చుకొనే నిమిత్తము సేవలు చేయరాదు. ఈ విధమైన సేవలు, సేవలు అనిపించుకోవు. పవిత్రత, సేవయందున్న దివ్యత్వములను మానవుడు గుర్తించుకొనలేక సేవలలో పాల్గొనుటకు వెనుకంజ వేస్తున్నాడు. ఏదో దేశమును ఉద్ధరించటానికి సేవలు చేస్తున్నామని భావించటము చాలా పొరపాటు. దేశమును ఉద్ధరించుటకై నీవు సేవ చేయనవసరము లేదు. ఈ సేవలన్నియు కేవలము నిన్ను నీవు ఉద్ధరించుకొనుటకు చేస్తున్నానని భావించాలి. పరసేవా ఫలితము, పరసేవయొక్క దివ్యత్వము గుర్తించుకొనలేక యితరులకు సేవచేస్తున్నామనే అహంకార భావముచేత, స్వార్థపరమైన దృష్టిచేతను సేవలలో పాల్గొంటున్నాడు మానవుడు

**సద్గుణంబులు త్యాగంబు సత్యనిష్ఠ**
**లేని మనుజుండు ప్రాణము లేనివాడె**

సేవ చేయని జీవితము చీకటింటి జీవితముగా భావించాలి.

**మానవుని జీవితము సమాజమునుండి ఏర్పడినదే!**

మన జీవితము సమాజమునుండియే ఏర్పడినది. నీ కీర్తి ప్రతిష్ఠలుగానీ, నీ సుఖ సంతోషములుగానీ, భోగభాగ్యములుగాని సమాజమునుండి వచ్చినవే! సర్వసమస్యలు తీర్చే ఈ సమాజమునకు, సర్వసుఖములు అందించే ఈ సమాజమునకు, మానవత్వాన్ని వికసింపచేసే ఈ సమాజమునకు సేవలు చేయకున్న యింక ఎవరికి చెయ్యాలి? ఇన్ని విధములుగా పరతత్త్వాన్ని బోధించే ప్రకృతికి మనము సేవలు చేయకున్న ఎవరికి చేయాలి? మన చేతి రుమాలు క్రింద పడితే దానిని ఎవరైనా ఎత్తి యిచ్చినప్పుడు thanks అని వాళ్లకు కృతజ్ఞతను తెలుపుకుంటున్నారు. కానీ యిన్ని అనుకూలములు, యిన్ని సౌకర్యములు అందించిన సమాజమునకు మనము యింత మాత్రమైన thanks చెప్పనక్కర లేదా? ఇట్టి కృతజ్ఞత లేని మానవ జీవితము క్రూరమృగములకంటే హీనమని తలంచాలి. సేవ అనేది మానవుని ప్రధాన కర్తవ్యము, జీవిత ప్రధాన లక్ష్యము. ఇట్టి లక్ష్యమును విస్మరించి జీవితమును వ్యర్థము గావించుకొనుచున్నాము.

srisathyasaivachanamrutam

**ఆడంబరము ఉండినంతవరకు ఆత్మతత్త్వము అర్థము కాదు**

సేవకు కావలసినది ధన, ధాన్యములు వస్తు సామగ్రి కాదు. ప్రేమ లేక ఎన్ని సేవలు చేసినప్పటికిని అది కేవలము వ్యర్థమే అవుతుంది. మనము ఈనాడు ప్రేమతత్త్వాన్ని హృదయములో నింపుకోవాలి. ప్రకృతియొక్క చైతన్యము వ్యర్థమైనది కాదు. దానిని అహంకార పూరితముగా అనుభవించినప్పుడు వికృతమవుతుంది. ఆత్మ పరముగా అనుభవించినప్పుడు సుకృత మవుతుంది. ఏ పవిత్రమైన భావము సర్వ జంతువులనుండి వేరుచేసి మానవుని దివ్యమానవునిగా నిరూపించినదో అట్టి మానవత్వాన్ని ఈనాడు మనము విస్మరిస్తున్నాము. ఈనాడు మానవుడు కేవలము ఆకార మానవుడుగా ఉంటున్నాడు గాని మానవత్వమనేది ఏమాత్రము కనుపించటము లేదు. ధనము, అధికారము, లౌకిక భోగభాగ్యములు యివియే తప్ప యింక అన్యమైన విషయములను గురించి విచారణ సల్పటం లేదు. ధనమే మానవుని ఉద్ధరించుచున్నదనే భావము ప్రజలలోపల అమితముగా పెరిగిపోయింది. అదియే మానవత్వ నిర్మూలమునకు ముఖ్య కారణము. ఈ ధనము మనను పోషించటము లేదు. మనలను రక్షించటం లేదు. ధనము అవసరమే! కాని, మితమైన ధనముతో హితమైన జీవితాన్ని గడపాలి. ఈనాడు సేవలయందు ఆడంబరము, అహంకారము ఉన్నత స్థాయిని అందుకున్నవి. ఆడంబరము వుండినంతవరకు ఆత్మతత్త్వము అర్థము కాదు. ఇట్టి ఆత్మతత్త్వము అర్థము కాకుండా మానవత్వాన్ని వికసింపచేయలేడు. మానవత్వము వికసింపచేసుకొనకుండా అసలు మానవుడే కాదు. కనుక, సేవలయందు ప్రధానమైనది త్యాగము. అహంకారమును మొట్టమొదట త్యాగము చేయాలి.

**భావమందు తుచ్ఛ భావము వీడుటే**
**త్యాగమగును అదియె యోగమగును**
**ఆస్తి ఆలి వీడి అడవి కేగుట కాదు**

మన పవిత్రమైన భారతీయ సంస్కృతియందున్న ప్రధానమైన అంశములను సరైన అర్థముచేత ప్రజలకు బోధించే వ్యక్తులు లేకపోవటంచేత సమాజము పెడమార్గము పడుతున్నది. ఎవరికో మనము సేవ చేస్తున్నామనే భావము చాలా పొరపాటు. ఆ రూపములో నున్న పరమాత్మకే

sri sathyasai vachanamrutam

నేను సేవ చేస్తున్నానే ఉన్నతమైన, పవిత్రమైన భావము కలగాలి. ప్రతి వ్యక్తియందు భగవంతుడున్నాడనే విశ్వాసమును మనము అభివృద్ధిపరచుకోవాలి.

**పరుల దూషణ చేయ పాపఫలంబబ్బు**
**విడువదెన్నటికిని విశ్వమందు**
**పరులు పరులు కారు పరమాత్ముడేయగు**

కనుక, ఎవ్వరినికూడను మనము బాధించరాదు, ఎవరిని మనము దూషించరాదు. అది కేవలము నీయొక్క దుర్గుణములయొక్క స్వభావము. తనయందు అణగి మణగియున్న దుర్గుణములు తాను ప్రకటించుకొనే అవివేకమే! యితరుల దోషములను నీవు ఒక్క వేలితో చూపుతున్నప్పుడు నీయందున్న పది దోషములు యితరులు చూపటానికి సిద్ధముగా వుంటారు. ఈ సత్యాన్ని గుర్తించుకున్న వ్యక్తి ఎవ్వడూకూడను యితరులను దూషించలేడు. తనను తాను గొప్పగా చెప్పుకోటం, యితరులను చిన్నగా చూడటం తుచ్ఛునియొక్క స్వభావమే! ఇలాంటి దుర్గుణములు, దుర్భావములు, మానవునినుండి దూరమైనప్పుడే మానవుడని చెప్పటానికి సాధ్యమవుతుంది. ప్రతి వ్యక్తియందుకూడను మనము భగవద్దర్శనము చేయాలి. అప్పుడే సేవయందు ఫలితము లభిస్తుంది. ఫల నిమిత్తమై సేవలు చేయక ఇది నా ప్రాప్తి అనే భావముతో మనము సేవలు చేయాలి. ఇలాంటి పవిత్ర భావముతో నిర్మల, నిశ్చల, నిస్వార్థమైన మార్గములో మనము ప్రవేశించినప్పుడే ఇది సేవ అనిపించుకుంటుంది.

**స్వామికి, మీరు చేసే సేవలకు ఎట్టి సంబంధము లేదు**

దివ్యాత్మస్వరూపులారా! ఈ సేవలు కేవలము మీ యొక్క పవిత్రతను ఆశించి, ఉన్నత స్థాయిని కోరి, మీ మీ భక్తి ప్రపత్తులచేత దీనిని నియమించుకోటమే గానీ ఈ సేవలకు, స్వామికి ఎట్టి సంబంధము లేదు. కర్మలచేత మీయొక్క మాలిన్యములు కడిగివేయవచ్చుననే ఉద్దేశ్యముచేత, చిత్తశుద్ధి నిమిత్తమై కర్మలాచరించమని మాత్రమే స్వామియొక్క ప్రబోధ. ఏ కర్మలు ఆచరించినప్పటికిని అవి కేవలము మీలోని మాలిన్యమును దూరము చేసుకొను నిమిత్తమే! కర్మలద్వారా ముక్తి కలుగుతుందనిగాని, జన్మసార్థకత్వమవుతుందనిగాని భావించటం చాలా పొరపాటు. చిత్తశుద్ధి లేక జన్మసార్థకత్వము ఏరీతిగా లభించగలదు? చిత్తశుద్ధి నిమిత్తము

sri sathyasai vachanamrutam

కర్మలాచరిస్తున్నామనే భావము మీరు హృదయములో అభివృద్ధి చేసుకోవాలి. నిష్కామ కర్మ నిమిత్తమై ఈ జన్మ ఏర్పడినదనే సత్యాన్ని గుర్తించాలి. జన్మనుండి కర్మ, కర్మనుండి ధర్మ, ధర్మనుండి దైవము మనకు ప్రాప్తించాలి. అదే 'జన్మ, కర్మ, ధర్మ, బ్రహ్మ'. ఈ నాల్గింటియొక్క సన్నిహిత సంబంధమును మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. కర్మలు చేయటానికి లేక సేవలు చేయటానికి నాకు వ్యవధి లేదనియు, ఆఫీసు పనులున్నాయనియు, యింకా అనేక విధములైన బాధ్యతలున్నాయనియు సాకుచెప్పి తప్పించుకోటము కేవలము ఒక బలహీనత. సేవలు అంటే బజార్లు వూడ్చి ప్రజలకు సేవ చేయటము మాత్రమే కాదు. నీ duty యందు కూడను, నీ పనియందు కూడను, సక్రమమైన రీతిగా ఆచరించటము అదికూడా సేవయే! ముఖ్యముగా అధికారులుగా వుంటున్నవారు తాము పుచ్చుకునే జీతమునకు తగిన పని చేయటమే గొప్ప సేవ. ఈనాడు ఏ అధికారి, ఏ ఉద్యోగి తాను పుచ్చుకునే జీతమునకు తగిన పని చేసేవాడు ఎక్కడా కనిపించటము లేదు. ఇంకా ధనము అధికము కావాలి అని ఆశిస్తున్నాడేగాని తీసుకుంటున్న ధనమునకు తగిన కర్మలు నేను ఆచరిస్తున్నానా లేదా అని ఆలోచించటం లేదు. ఇది కేవలము దేశద్రోహముగా భావించుకోవాలి. ఇది ఎవరి ధనము? ప్రజల ధనమే! ప్రజలకు ఈ విధమైన అపకారము చేయటముకూడను సేవకు విరుద్ధమైన మార్గమే. ఒక అధ్యాపకుడు వుంటున్నాడు. అతను పిల్లలకు ప్రబోధ చేస్తున్నాడు. ఆ చేయవలసిన బోధలు ఉత్తమమైన మార్గములో చేయటముకూడను సేవయే! ఒక వ్యాపారి వుంటున్నాడు; అతడు బజార్లో పోయి వూడ్చనక్కరలేదు. తన వ్యాపారములో నిర్ణీతమైన ఆదాయమునకు మించి తాను ఏమాత్రము ముందుకు పోకూడదు; అదికూడను సేవయే! అట్టి భావము మనసులో వుంచుకున్నప్పుడు వాడు సేవకుడుగా చెప్పకనే రూపొందుతాడు. తన మనసుకు తాను తృప్తి పరచుకునే మార్గములో ప్రవేశించాలి. నేను సక్రమముగా చేస్తున్నానా లేదా అనేటువంటిది తన conscienceకి తెలుస్తుంది. సేవ అనేది ముందుగా తనకి చక్కని తృప్తి నందించాలి. స్వామికి ప్రీతికరమైనది ఏమంటే తన కర్తవ్యమును సక్రమముగా నిర్వర్తించటమే! అదే సేవ. అవకాశము చిక్కినప్పుడల్లా ఈ సమాజములో ప్రవేశించి సేవలు చేయి. కేవలము వ్యక్తి సేవయే సేవగా భావించరాదు. దేశసేవకూడను ప్రధానమైన సేవయే! ఈ విధమైన సేవా భావమునందే దివ్యత్వము అనుభవించటానికి అవకాశము వుంటున్నాది.

sri sathyasai vahini

### గ్రామసేవలో గ్రామస్థులు పాల్గొనేటట్లు చేయాలి

సేవను ఎవ్వరు ఏ విధముగాను కోరి ఆశ్రయించనక్కరలేదు. ఎక్కడ సేవ అవసరమని భావించినా నీ దృష్టిపడిన దగ్గరంతాకూడ నీవు నడుము వంచి సేవ చేయి! ఇట్టిది, అట్టిది అనే భేదభావము నీవు చూడవద్దు. ఇతను బీదవాడా లేక శ్రీమంతుడా అనే తారతమ్యము నీకు అక్కర లేదు. ఎలాంటి వారికైనా, ఏ స్థానమునందైనా, ఎప్పుడైనా అవసరమైనప్పుడు సేవలు చేయటము ప్రధానము. కష్టములు, దుఃఖములు, బాధలు అందరికి సమానమే! కనుక అలాంటి పరిస్థితులయందు ఏమాత్రము విచారణ చేయకుండా సేవలలో పాల్గొనటము అత్యవసరము. ముఖ్యముగా ఈనాడు పల్లెలయందు చాలా అనానుకూలమైన పరిస్థితులలో జీవిస్తున్నారు ప్రజలు. అలాంటి పరిస్థితిలో మనము పల్లెలకు వెళ్లి వారికి సేవాభావము అర్థమయ్యేరీతిగా బోధించి, వారినికూడ ఈ సేవలలో పాల్గొనేటట్లు చేయాలి. చాలామంది పల్లెలకు వెళ్లి అశుభ్రమైన ప్రదేశాలను శుభ్రపరుస్తున్నారు. మాలిన్యములుగా వున్నదానిని పరిశుద్ధము చేసి వస్తున్నారు. ఈ రీతిగా ఎంతకాలము చేయగలరు? ఈ పరిశుద్ధము ఎందుకు చేస్తున్నాము, ఈ మాలిన్యము ఎందుకు దూరము చేస్తున్నాము అనే విషయము ఆ పల్లె ప్రజలకు అర్థమయ్యేరీతిగా మనము బోధించాలి. "దీనివలన మనకు, మన బిడ్డలకు అనారోగ్యము ఏర్పడుతుంది. ఈ అనారోగ్యమువలన మన జీవితమనేది చాలా క్షీణించిపోతుంది. మన కర్తవ్యమును మనము నిర్వర్తించుకోలేకపోతాము. ఆరోగ్యమే మహాభాగ్యము", అనే విషయమును వారికి బోధించినప్పుడు వారే యిందులో ప్రవేశించి నిత్యము వారి యింటిని, పరిసరములను శుభ్రము చేసుకోటానికి ప్రయత్నిస్తారు. అట్లు కాకుండా కేవలము నెలకొక పర్యాయము, రెండు నెలలకొక పర్యాయము మనము పరిశుద్ధము చేసినంతమాత్రమున ప్రయోజనము లేదు. పల్లె ప్రజలచేతనే ఆ పల్లె పరిశుద్ధపరచటానికి తగినంత ప్రయత్నము చేయాలి.

### బంధనముండి విముక్తి కావాలంటే కోరికలు తగ్గించుకోవాలి

అదేవిధముగానే పూర్వము Celing on desires అనే ఒక పథకము ప్రవేశపెట్టటం జరిగింది. దీనియొక్క అంతరార్థమేమిటి? మానవుడు మితిమీరిన కోరికలచేత మతి తప్పి భ్రమిస్తున్నాడు. కేవలము ఉన్మత్తుడై జీవిస్తున్నాడు. పరతత్వాన్ని విస్మరిస్తున్నాడు. కనుక,

srisathyasaivahini.in

మొట్టమొదట ఈ కోరికలను కొంతవరకు అదుపులో పెట్టుకోవాలనే ఉద్దేశ్యముతోనే Celing on desires అనే పేరుతో స్థాపించారు. ధనమునుకూడను అమితముగా వ్యయము చేస్తున్నారు. ఈ విధముగా వ్యయముచేసే ధనమును ప్రజలకు, దిక్కులేనివారికి, దీనులకు తగినరీతిగా ఉపయోగపెట్టాలనే ఉద్దేశ్యముతో దీనిని ప్రారంభించారు. కానీ దీనియొక్క సత్యస్వరూపాన్ని గుర్తించుకొనలేక కేవలము డబ్బు యివ్వటమే ప్రధానమైన లక్ష్యములో వుంచుకొని వారియొక్క కోరికలను యధారీతిగా పెంచుకుంటూనే పోతున్నారు. మన కోరికలను తగ్గించుకోవాలి. ప్రాపంచిక సంబంధమైన విషయాలు ఎంతవరకు మనము పెంచుకొందుమో అంతవరకు అశాంతే పెరుగుతుంది. దీనివలన మానవుడు బంధింపబడుతున్నాడు. ఈ బంధననుండి విముక్తి కావాలంటే మనము కోరికలు తగ్గించుకోవాలి. ఎంతవరకు అవసరమో అంతవరకే పెంచుకోవాలి.

**కోరికలు తగ్గించుకునే విధానము**

కోరికలు ఏ విధముగా తగ్గించుకోవాలి? నీకు ఎంత అవసరమో అంత భోజనాన్ని నీవు భుజించు. అనవసరముగా ఆశకొలది దండిగా వడ్డించుకొని వ్యర్థము చేయటము దోషముగా వుంటుంది. ఆ అన్నము యింకొక వ్యక్తికి పెట్టి వానిని సంతృప్తి పరచవచ్చును. కనుక, మొట్టమొదటిది Do not waste food. నీవు ఆహారము ఏమాత్రము వ్యర్థము చేయకూడదని యిది ప్రధానమైన సూత్రముగా తీసుకున్నారు. 'అన్నం బ్రహ్మ', 'ప్రాణం బ్రహ్మ.' అన్నమునుండియే మానవుడు వృద్ధివిస్తున్నాడు. మానవునియొక్క జీవితమునకుగానీ, మానవునియొక్క దేహమునకుగానీ, మానవునియొక్క మనస్సుకుగానీ అన్నమే ప్రధానము. మానవుడు భుజించిన ఆహారము స్థూలరూపములో మలముగా విసర్జింపబడుతున్నది. సూక్ష్మరూపములో రక్తముగా మారుతున్నది. అతి సూక్ష్మమైన రూపములో మనస్సుగా మారుతున్నాది. కనుక, ఎట్టి ఆహారమో అట్టి మనస్సు. ఈనాడు మనయందు ఈ రావణ బుద్ధులు అభివృద్ధి కావటానికి ఆహారమే మూలకారణము. దయ, దాక్షిణ్యము, సహనము, ప్రేమ లేకుండా కేవలము ద్వేషము, అసూయ, రాగము, యిలాంటి దుర్గుణములు అభివృద్ధి పొందుతున్నాయి. దీనికంతా ఆహారమే మూలకారణము. కనుక, ఆహారము పరిశుద్ధమైనదిగాను, పవిత్రమైనదిగాను, సాత్త్వికమైనదిగాను వుంటుండాలి. ఆహారముచేతనే

srisathyasaivachanamrutam

మానవ రూపము ఏర్పడుతున్నది. మనము త్రాగే జలము మూత్రముగా పోతున్నది. అతి సూక్ష్మమైనది ప్రాణముగా రూపొందుతున్నది. కనుక జలము, ఆహారము ఈ రెండింటియొక్క తత్త్వముచేతనే మానవుని జీవితము దివ్యత్వాన్ని అందుకొనుటకు వీలవుతుంది. 'అన్నం బ్రహ్మ' అన్నారు. అన్నమును వ్యర్థము చేస్తే నీవు దివ్యత్వమును వ్యర్థము చేసినవాడవౌతావు. కనుక, సాధ్యమైనంతవరకు సాత్త్వికాహారము ఎంతవరకో అంతవరకు భుజించి మిగిలినది ఎవరికైనా పెట్టి పరోపకారము చెయ్యి.

రెండవది ధనము. భారతీయులంతా ధనమును లక్ష్మీ స్వరూపముగా భావిస్తూ వుంటారు. దీనిని దుర్వినియోగము చేయకూడదని చెప్పారు. దీనిని దుర్వినియోగము చేసినప్పుడు మనలో దుర్భావములు, దుర్బుద్ధులే అభివృద్ధి అవుతాయి. కనుక, ధనమును సద్వినియోగము చేయాలి. Do not waste money, misuse of money is evil అన్నారు. ఇంక మూడవది, అత్యవసరమైనది, అత్యంత ప్రధానమైనది, కాలము. వ్యర్థము చేయకూడదు, కాలమును సార్థకము చేయాలి. ఎందుకంటే సర్వము కాలముపైనే ఆధారపడి వుంటున్నది. కనుకనే శృతులయందు 'కాలాయనమఃకాలకాలాయనమః, కాలదర్పదమనాయనమః, కాలాతీతాయనమః, కాలస్వరూపాయనమః, కాలనియమితాయనమః' అని చెప్పబడింది. అంతా కాలముపైనే ఆధారపడి వుంటున్నాది. మానవునియొక్క జనన, మరణములకుకూడను కారణము కాలమే! కాలమును వ్యర్థము చేస్తే జీవితమే వ్యర్థమైపోతుంది. కనుక, కాలమే మనకు ప్రాణము. అనవసరమైన మాటలలో ప్రవేశించి, యితరుల మంచి చెడ్డల విమర్శలలో ప్రవేశించి, కాలమును నీవు అపవిత్రము చేసుకోవద్దు. దీనినే don't waste time అన్నారు. కాలము వ్యర్థము చేయవద్దన్నారు. నాలుగవది మనయొక్క శక్తిని, అనగా శరీర మానసిక ఆధ్యాత్మిక శక్తులను కూడను మనము వ్యర్థము చేయకూడదు. ఈ శక్తి ఏ రీతిగా వ్యర్థము అవుతోంది? చెడ్డ చూడటంవలన శక్తి వ్యర్థమవుతున్నది. చెడ్డ వినటములో శక్తి వ్యర్థమవుతున్నది. చెడ్డ మాట్లాడటంలో శక్తి వ్యర్థమవుతున్నది. చెడ్డ తలంపులు చేయటంవలన శక్తి వ్యర్థమవుతున్నది. చెడ్డ పనులు చేయటంచేత శక్తి వ్యర్థమవుతున్నది. కనుక, ఈ ఐదింటియందు సక్రమమైన మార్గమును అనుసరించి నీ శక్తిని అభివృద్ధిపరచుకొని దివ్యత్వముగా మార్చుకోమని దీని అంతరార్థము.

See no evil, see what is good
Hear no evil, hear what is good
Talk no evil, talk what is good
Think no evil, think what is good
Do no evil, do what is good

This is the way to God

చెడ్డను చూడకుండా, చెడ్డను వినకుండా, చెడ్డను తలచకుండా మంచినే చూస్తూ వుంటుంటే యిదే దైవత్వానికి మార్గము.

**ఈనాటి మానవునకు విచక్షణా జ్ఞానము శూన్యమైపోయింది**

మన శక్తినంతా వ్యర్థము చేయటంచేత జ్ఞాపకశక్తి పోతున్నాది, ప్రజ్ఞాశక్తి పోతున్నాది, మేధాశక్తి పోతున్నాది, పరిణామ శక్తికూడా పోతున్నాది. కనుకనే యీనాటి మానవునకు విచక్షణా జ్ఞానమే శూన్యమై పోయింది. ఇంక, క్రియాశక్తి ఏ విధముగా ప్రవేశించగలదు? శక్తి ఎట్లా వ్యర్థమవుతున్నాదని మనకు కొంత అనుమానము కలుగవచ్చును. ఒక రేడియో వుంటుండాది. ఏదో ఒక స్టేషను పైన adjust చేసి న్యూస్ మనము వింటున్నాము. దాని Sound పెద్దగా చేయి లేక చిన్నగా చేయి ఆన్‌లో పెట్టి వుంచితే చాలు, కొన్ని యూనిట్లు కరెంటు ఖర్చు అవుతుంది. అదే విధముగనే మన దేహము ఒక రేడియో వంటిది. నీవు నోటితో మాట్లాడినా మనసులో తలచినా అదంతా కూడను waste అయినట్టే! ఎదుకంటే నీ మనసు పనిచేస్తున్నాదక్కడ. అది onలో వుంటున్నాది. నిద్రించేంతవరకుకూడను ఏదో ఒకటి చింత చేస్తుంటావు. ఈ చింతలు చెడ్డ చింతలు చేయకుండా మంచి చింత చేస్తే ఎంత హాయిగా వుంటాది! ఈ విధముగా నీవు చింతన చేసి కార్యములో ప్రవేశించి నీ యొక్క దివ్యమైన శక్తిని వ్యర్థము చేసుకుంటున్నావు. ఈ విధముగా ఈ నాలుగుకూడను కొంతవరకు అదుపులో పెట్టుకొని జీవించమనే Celing on desires అని పేరు పెట్టారు. కానీ ఈనాటి సేవాదళ్ కార్యకర్తలు ఈ విధముగా చేయటము లేదు. ఏదో సాయి సంస్థలలో ధనము ప్రోగుచేయటం కోసమని ఈ పథకమును ప్రారంభించారనే ఉద్దేశ్యముతో కొంత ధనము విరాళముగా ఇవ్వటము, వారు తప్పించుకోటము జరుగుతోంది. ఈ విధమైన యుక్తిచేతనే వారు తమ జీవితమును వ్యర్థము చేస్తున్నారు. ధనమును సత్యసాయి సంస్థలు ఏనాడుకూడను ఆశించలేదు. మీరు

sri sathyasai vachanamrutam

జగత్తునకు ఆదర్శవంతమైన జీవితాన్ని నిరూపించమనే ఈ సంస్థలను ప్రారంభించింది. మనము ఆదర్శవంతముగా జీవించి యితరులకు ఆదర్శమునందించే ఉత్తమోత్తములుగా రూపొందాలి. కనుక మన మనో వృత్తులను క్రమక్రమేణా మార్చుకొనుటకు ప్రయత్నించాలి. సాయి సంస్థలలో జాతి మత భేదములకు ఏమాత్రము అవకాశము లేదు.

**మన మతము ఒక్కటే! అదే మానవ మతము**

దివ్యాత్మ స్వరూపులారా! జాతికంటె నీతియే ప్రధానము. మతముకంటె మమత పెంచుకోటానికి ప్రయత్నించాలి. మమతలేనివాడు మతమును పట్టుకొని వ్రేలాడి ప్రయోజనమేమిటి? ఈ మతము మతిని చెడగొడుతున్నాది. మన మతము ఒక్కటే, అదే మానవ మతము. మన నీతి ఏమిటి? ప్రేమయే నీతి. ఇలాంటి ప్రేమ తత్త్వాన్ని పెంచుకొని, నీతి నిజాయితీలను ఆదర్శముగా నిరూపించి, తోటి మానవులను సరైన మార్గములో ప్రవేశింపచేయటానికి ప్రయత్నించాలి. అనాది కాలమునుండి భారతదేశము అనేక విధములుగా సత్యధర్మములను ప్రబోధిస్తూ వచ్చినది. కనుకనే 'సత్యం వద, ధర్మం చర' అనే పవిత్ర సూక్తులు ఈనాటికికూడను భారతదేశమునందు మారు మ్రోగుతున్నవి. అట్టి దివ్యమైన సత్యధర్మములను సహన సానుభూతులతో దేశములో వ్యాప్తి గావించినప్పుడు యింతకంటె శుభప్రదమైనది దేశములో మరొకటి వుండదు. కేవలము సైన్సు, సైన్సు అని విజ్ఞానము పెంచుకొని, వివేకము లేకుండాపోతే అట్టి విజ్ఞానము వ్యర్థమే! నూరుమంది మేధావులకంటె ఒక్క మంచిమనసు కలిగినవాడు చాలు. మంచి మనసు వుండాలి. అటువంటి ఒక్క వ్యక్తిద్వారా జగత్తుకు యెంతైనా మేలు కలుగుతుంది. మనిషి అంటే మనసునుంచి వచ్చినవాడు. మనసు వుత్తమమైనదిగను, పవిత్రమైనదిగను వుండినప్పుడే మనిషిగా రూపొందుతాడు. యిలాంటి మనస్తత్త్వాన్ని మనము అభివృద్ధిపరచుకోవాలి. నీకు యింద్రియముల యొక్క వికాసము యెంతైనా వుండవచ్చును. మానసిక వికాసము అంతకంటె అధికముగా వుండవచ్చును. బుద్ధియొక్క వికాసము అంతకంటే తీక్షణముగా వుండవచ్చును. అయితే, వాటితోబాటు ఆధ్యాత్మిక వికాసముకూడా అత్యవసరమని గుర్తించాలి. ఆధ్యాత్మిక వికాసమే లేకపోతే యింద్రియ వికాసము, మనో వికాసము, బుద్ధి వికాసము కేవలము కృత్రిమముగా రూపొందుతుంది.

srisathyasaivachanamrutam

యాంత్రికమైన జీవితమవుతుంది. కాదు, మన జీవితమును మంత్రమయమైన జీవితముగా రూపొందింపచేసుకోవాలి. మన జీవితము యంత్రమయము కాదు. ఇలాంటి దివ్యమైన మార్గమును నిరూపింపచేయటానికే ఈ సంస్థలు ప్రారంభించాము. నీ శక్తికొలది సమాజములో ప్రవేశించి తోటి మానవులకు సేవచేయి. ఇంత, అంత అని ఆడంబరాలకు పోవద్దు. అహంకారమును ప్రవేశపెట్టవద్దు. నీవొక దివ్యమైన సేవకుడుగా రూపొందు. సేవకుడు కాక, నాయకుడు కాలేడు. కింకరుడు కాక, శంకరుడు లేడు. కనుక, సత్యసాయి సేవా సంస్థలకు కార్యకర్తలు వెన్నెముకవంటివారు.

**సత్యసాయి సంస్థలలో అందరూ కార్యకర్తలే!**

ప్రేమస్వరూపులారా! ముఖ్యముగా కార్యకర్తలుగా వుండినవారు సరైన మార్గములో నడచుకోవాలి. మీరేమైనా తప్పు మార్గములో ప్రవేశిస్తే యింక అందరు తప్పు మార్గములోనే ప్రవేశిస్తారు. కనుక జగత్తును సరైన రీతిగా తీర్చి దిద్దాలనుకుంటే కార్యకర్తలు ఉన్నతమైన, నిస్వార్థమైన భావములు అభివృద్ధి పరచుకోవాలి. సేవా భావమునందు స్వార్థమును, స్వప్రయోజనమును ఏమాత్రము ప్రవేశపెట్టరాదు. ఆడంబరాలకు ఏమాత్రము అవకాశము ఉండకూడదు. ఈనాడు జగత్సంబంధమైన విషయములన్నింటియందుకూడను ఆడంబరము పెరిగిపోయింది. ఇది ఒక ఫ్యాషన్‌గా రూపొందింది. ఇది దేశానికి హానికరమేగాని, ఉపయోగము కాదు. కనుక, సత్యసాయి సంస్థలన్నీ నిరాడంబరముగా, నిరహంకారముగా, నిస్వార్థముగా పవిత్రమైన ప్రేమతత్త్వాన్ని పెంచుకొని దివ్యమైన త్యాగ తత్త్వాన్ని అభివృద్ధి పరచుకొని, సహన, సానుభూతులను ఆచరణలో పెట్టాలి. అదే నిజమైన సేవకునికి తగిన గుణము. ఇంతే కాకుండా, అధికారమును చలాయించరాదు. అందరు కార్యకర్తలే! అందరూ సమానమే! కానీ కర్తవ్య నిర్వహణలో నీవు ఒక విధమైన స్థానములో వుండినప్పుడు తోటివారు సక్రమముగా పని చేస్తున్నారా, లేదా అనే విషయమును గుర్తించటానికి ప్రయత్నించాలి.

**'నాకు మందిరాలు అక్కరలేదు'**

ప్రేమకు అధికారమే లేదు. మన discipline ప్రేమతో కూడినదిగా వుండాలి. మిలట్రీఫోర్సుగా వుండకూడదు. ప్రేమ ఫోర్సుగా వుండాలి. ప్రేమతో మాట్లాడాలి. దోషము

లేమైనా వుంటే ప్రేమతోనే చెప్పి సరిదిద్దుకోవాలి. అన్నింటియందుకూడను ప్రేమతత్త్వాన్ని అభివృద్ధి పరచుకోవాలి. దీనిని పురస్కరించుకొనియే

Start the day with love
Spend the day with love
Fill the day with love
End the day with love
This is the way to God

అని చెప్పడం జరిగింది.

మనము అన్ని విధముల ప్రేమతోనే జీవించాలి. ప్రేమయే దైవము; దైవమే సర్వత్రా వున్నది. మీరందరు ప్రేమస్వరూపులే! ప్రేమతోనే జీవించండి. ప్రేమతోనే సేవించండి. ప్రేమతోనే ఆనందించండి. ఈ ప్రేమలోనే లీనము కండి. ఇది ప్రేమతో కూడిన నిజమైన సేవ. ఏ ఇతర విషయములతో సంబంధము లేకుండా సత్యసాయి సంస్థలంతాకూడను ప్రేమకు ప్రేమ, హృదయానికి హృదయము, అందించుకుంటూ సంస్థలు అభివృద్ధి పరచాలి. ధనము, అధికారము మొదలైనవాటికి మన సంస్థలలో ఏమాత్రముకూడను అవకాశము వుండరాదు. నాకు మందిరాలు అక్కరలేదు. ఆలయాలు అక్కరలేదు. యజ్ఞయాగాది క్రతువులు అక్కరలేదు. మన కర్మయే మనకు యజ్ఞము. మన సేవయే మనకు క్రతువు.

**సత్యసాయి సంస్థలు ధన సంబంధము కాక, గుణముతో సంబంధము పెట్టుకోవాలి**

కనుక యజ్ఞయాగాదుల పేరుతోగాని, మందిరముల పేరుతోగాని, యింకే విధమైన పేరుతోగాని సత్యసాయి సంస్థలలోపల వసూళ్ళు చేసే దూర్గుణమును ఈనాటినుండి మానుకోవాలి. నేను అనేక పర్యాయములు చెప్పుతూనే వున్నాను. ధనముతో మనకు ఎట్టి సంబంధము వుంటుండకూడదు. గుణముతో సంబంధము వుంటుండాలి అని. కానీ, సంస్థలలో వుండిన వ్యక్తులే ధనము Collection చేసి కొంతవరకు సన్నిహిత సంబంధ బాంధవ్యాన్ని పెంచుకుంటున్నారు. ఇంకా కొంతమంది స్వామిపేరు చెప్పుకొని స్వామి నాకేదో కొన్ని శక్తులు యిచ్చారని ఈ విధమైన మార్గములో ధనమును వసూలు చేస్తున్నారు. ఇంతకంటె రాక్షసత్వము మరొకటి లేదు. ఇంత కాలమైంది; నేను ఎప్పుడూకూడను, ఎవ్వరినికూడను, ధనము ఏమాత్రము

srisathyasaivachanamrutam

కోరలేదు. కానీ, కొంతమంది సాయిపేరును ఉపయోగపెట్టి ఈ విధమైన పెడమార్గములో ప్రవేశించి సాయికి చెడ్డపేరును తెప్పిస్తున్నారు. సంస్థను ఒక వ్యాపార రంగముగా రూపొందింప చేస్తున్నారు. నిజమే, యిది వ్యాపారమే! ఏ వ్యాపారము? ప్రేమను యిచ్చి పుచ్చుకునే వ్యాపారము. కానీ, సంస్థలలో వుండిన వ్యక్తులుకూడను ధనమును ప్రోగుచేసే విషయములో ప్రవేశించి వారిని, వీరిని అనేక రకములుగా ఉపయోగించుకుంటూ నేను ఎంత చెప్పినప్పటికిని డబ్బును వసూలు చేస్తూనే వున్నారు. మన సంస్థలో ఎవరికైనా యివ్వటముగాని, యిప్పించుకోటంగాని రెండుకూడ జరగకూడదు. మన సంస్థలలో అందరు దరిద్రులు కారు, కొంతవరకు శ్రీమంతులుకూడా వుంటున్నారు. అలాంటి సేవలు చెయ్యాలంటే శ్రీమంతులు కొంచెము ముందుకు వచ్చి ఏమైనా సహాయము చేయవచ్చు కదా! ఈ శ్రీమంతులుకూడను బిక్షమెత్తే దరిద్రము వారికెందుకు? వుండేది చాలదా వాళ్లకు? యిలాంటి మార్గములో ప్రవేశిస్తే సాయీ సంస్థలకు చెడ్డపేరు వస్తుంది. నేను యిచ్చే ఆదేశము ఒక్కటే! సాయి సంస్థలకు చెడ్డపేరు రాకుండా చూచుకోండి. నిజానికి సంస్థలకు, నాకు సంబంధము లేదు. భక్తులందరు సంస్థలో చేరవచ్చు. భక్తులు కానివారుకూడను సంస్థలో చేరి సేవ చేయవచ్చు.

**మానవతా విలువలు పెంచుకోవాలిగాని, మనీ విలువలు కాదు**

ఈ సాయి సంస్థలలో ఏ కొంతమందో మెంబర్లు, ఏ కొంతమందో ఆఫీసు బేరర్లు అనే భేదము లేదు. ఈ సంస్థలు భక్తుల నిమిత్తము ఏర్పరుపబడినవేగాని వేరే నిమిత్తము కాదు. వీటిలో చేరడానికి ప్రతి మానవునికి అవకాశము వుంటుండాది. తన మానవత్వమును అభివృద్ధిపరచుకోటానికి ప్రతివ్యక్తికి అధికారము వుంటుండాది. మానవతా విలువలు పెంచుకోవాలిగాని, మనీ విలువలు పెంచుకోటం కాదు. ఎక్కడైనాకాని సాయీ సంస్థలలోపల యిలాంటి చందాలు వసూలు చేయటంగాని, పూజలు పునస్కారములని పేర్లుతో చందాలు వసూలుచేయటంగాని జరిగితే అది సాయి సంస్థ కానేరదు. భక్తులలోకూడ చాలామంది ఈ వ్యాపారములో ప్రవేశించి అలాంటివంతా చేస్తున్నారు. మీలో మీరు కొంతమంది శ్రీమంతులుకూడా కలసి ఏదైనా కార్యము చేయాలంటే దాంతో చేసుకోటంలో తప్పులేదు. అంతేగాని యింటింటికి పోయి మీరు భిక్షము అడుక్కోటానికి ఏమాత్రము ప్రయత్నం చేయకూడదు. సాయికి కావలసినది 'లోకాస్సమస్తా స్సుఖినో భవంతు.' అందరూ సుఖముగా



sri sathyasai vahini.org

వుంటుండాలి. అందరూ మానవత్వాన్ని అభివృద్ధిపరచుకోవాలి. మానవులకు, మానవులు సహాయము చేసుకోవాలి. సహన భావమును మనము పెంచుకోవాలి. అదియే 'జంతూనాం నరజన్మ దుర్లభం.' నరజన్మ దుర్లభమనటానికి యిదే మూలకారణము.

**సాయి సంస్థలు ధనము మరియు గవర్నమెంటుతో సంబంధము పెట్టుకోవద్దు**

ప్రేమ స్వరూపులారా! ధన సంబంధమైన వసూళ్ళు ఎక్కడ జరిగినప్పటికి, వాటికి, సాయీ సంస్థకు సంబంధము లేదని నిర్ణయము చేసుకోవాలి. మీరు సేవలు చెయ్యాలనుకుంటే సంస్థలో వుండిన వ్యక్తులు మీలో మీరు ఏర్పాటు చేసుకుని సేవ చెయ్యటంలో తప్పులేదు. ముఖ్యముగా మన సంస్థలకు ప్రధానమైన మార్గదర్శక సూత్రములు రెండే రెండు! ధనముతో సంబంధము వద్దు, గవర్నమెంటుతో సంబంధము వద్దు! మనకు ఎంత శక్తో అంతవరకే చేసుకుందాము. గవర్నమెంటు చేసే వుపకారములు గవర్నమెంటు చేస్తూనే వున్నారు. వారు చేసుకోనీ! వాళ్ల పేరును ఉపయోగపెట్టుకొని మనము యిందులో ప్రవేశించరాదు. మనము చేసేది మనము చేస్తాము. నీకు ఎంతో శక్తో అంత సేవలో పాల్గొను. ఈ విధముగా వుంటే గవర్నమెంటుకూడను ఎంతో help చేస్తుంది. అంతేగానీ వారితో ఏమాత్రము సంబంధము పెట్టుకోకూడదు. మంచివారు మనము చేసే సేవలకు మెచ్చి ఎంతైనా సహాయము చేయవచ్చును. ప్రభుత్వమును మనము నమ్ముకొని ముందుకు పోతే యింకొక ఆఫీసరు ఎవరైనా వచ్చి దీనికి సహాయము చేయకపోవచ్చు. అప్పుడు మన సంస్థ గతి ఏమిటి? మన బలముపైననే మనము ఆధారపడాలి. ఎవ్వరి బలముపైనను మనము ఆధారపడకూడదు. అదే ఆత్మబలము. ఆత్మబలమును విశ్వసించనినాడు యింక అన్నీ దుర్బలములే! సేవద్వారా మనము కర్మలలో పాల్గొనాలి. ఈ సేవలతో జగత్తును సరైన మార్గములో తీర్చిదిద్దాలి. అప్పుడే మన భారతదేశముయొక్క ప్రతిష్ట ఎంతైనా పెరుగుతుంది. మీరు వ్యక్తిగతమైన పేరు ప్రతిష్టలకోసం ప్రాకులాడకండి. ప్రేమ నిమిత్తమై మీరు ప్రాకులాడండి. ఇదే సాయిసంస్థలయొక్క ప్రధానమైన కర్తవ్యముగా మీరు గుర్తించాలి.

**(తేదీ. 21-11-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasaivachanamrutam